క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపన



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని శ్రీ సిద్దేశ్వరాలయంలో అభయ హనుమాన్ విగ్రహాన్ని గురువారం ప్రతిష్ఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు బీఎం శాస్త్రీ, సాయి శాస్త్రీ ఆధ్వర్యంలో మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పంచామృత అభిషేకం, జలాధివాహం, పుష్పాధివాహం చేశారు. అనంతరం యాత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం భక్తులకు తీర్థం, అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి-విజయ దంపతులతోపాటు, అర్చకులు గణేశ్ శాస్త్రీ, పురోహితులు భువనేశ్వర్ స్వామి, సంతోశ్ స్వామి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ పూజలు



ఖానాపురం : మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో గురువారం 8వ వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి హోమ పూజలు చేపట్టారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొని పూజ చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు అశోక్, బాలు, విజయ్, సుమన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఆహ్వానం



నర్సంపేట : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు రావాలని కోరుతూ ఆర్డీఓ ఉమారాణికి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం పత్రిక అందజేశారు. అనంతరం గోపాల్‌నాయక్ మాట్లాడారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు హాజరై గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను తిలకించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అజ్మీర శంకర్ నాయక్, గౌరవ అధ్యక్షుడు భానోతు లక్ష్మణ్ నాయక్, నూనావత్ జయరాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలి

పర్వతగిరి : ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత ఎంపీటీసీల ఓటరు లిస్టు, పోలింగ్ స్టేషన్ల వివరాలను ఎంపీడీఓ వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం నాయకులు బొట్ల కనకరాజు, ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, వినోద్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాలు పడి ఐదుగురికి గాయాలు

నర్సంపేట రూరల్ : ధాన్యం బస్తాలు పడి ఐదుగురు హమాలీలకు గాయాలైన ఘటన నర్సంపేట మండలంలోని రాజుపేట శివారు చింత గడ్డ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చింతగడ్డతండా సమీపంలోని ఉషాకిరణ్ రైస్‌మిల్లులో నిల్వ చేసిన ధాన్యం బస్తాలను తీస్తుండగా బస్తాలు కూలీలపై కుప్పగా కూలాయి. దీంతో హమాలీలు గుగులోతు కవిత, భూక్య స్వామి, అజ్మీర కవిత, భూక్య సాలమ్మ, బానోత్‌స్వామిల తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండడంతో గుగులోతు కవిత, భూక్య స్వామిలను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని వ్యాపారికి..

గీసుకొండ : కారు ఢీకొన్ని వ్యాపారికి గాయాలైన ఘటన మండలంలోని వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిలోని పంచముఖ అంజనేయ స్వామి ఆలయ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా.. మండల కేంద్రానికి చెందిన వటుకుల ప్రశాంత్‌రెడ్డి కొనాయమాకుల వద్ద రెస్టారెంట్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆయన ద్విచక్ర వాహనంపై వరంగల్‌కు వెళ్తుండగా నర్సంపేట నుంచి వరంగల్ దిశగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రశాంత్‌రెడ్డిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చేర్చగా చికిత్స పొందుతున్నాడు.

ఆయిల్ పామ్.. అధిక దిగుబడి

- ఎకరాకు 10–20 టన్నుల గెలలు
- నికర ఆదాయం రూ.1.70 లక్షలు
- సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలు
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి



దుగ్గొండి : రైతులు ఒకే రకమైన పంట సాగు చేస్తే దిగుబడి రాక నష్టాల పాలవుతున్నారు. మార్కెట్‌లో సరైన ధర లేక పండిన కొద్దిపాటి పంట ను అమ్ముకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ కాలంపాటు సిరులు కురిపించే ఆయిల్ పామ్ సాగును ఎంచుకుంటే రైతులు ప్రగతి సాధిస్తారని జిల్లా ఉద్యానశాఖ అధికారి సంగీతలక్ష్మి సూచిస్తున్నారు. ఆయిల్ పామ్ సాగు, దిగుబడి, అమ్మకం, ప్రభుత్వ ప్రోత్సాహకాలను ఆమె వివరించారు.

సాగు విధానం..

- ఆయిల్ పామ్ పంట వేయడానికి బంక నేలలు, చౌడు నేలలు పనికిరావు. నీటి సౌకర్యం ఉండి గాలిలో తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాలు చాలా అనుకూలంగా ఉంటాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని నేలలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలంగా ఉంటాయి.
- ఎకరం భూమిలో 57 మొక్కలు, హెక్టార్ అయితే 143 మొక్కలు నాటాల్సి ఉంటుంది. మొక్క మొక్కకు, సాలుకు సాలుకు మధ్య 9 మీటర్ల ఎడం ఉండాలి.
- మొదటి మూడు సంవత్సరాలు అంతర పంటగా వరి తప్ప అన్ని పంటలు సాగుచేసుకోవచ్చు.
- నాలుగో సంవత్సరం నుంచి ఆయిల్ పామ్ తోటలో దుక్కి దున్నరాదు.
- ఏడో సంవత్సరం నుంచి తోటలో అంతరపంటగా కోకో పంటను సాగుచేసుకోవచ్చు. దీని వల్ల ఎకరాకు ఏడాదికి రూ.50 వేల నుంచి 60 వేల అదనపు ఆదాయం వస్తుంది.



ఆయిల్ పామ్ తోట

- డ్రిప్, మినీ స్ప్రింక్లర్‌తో సాగునీరు అందించొచ్చు.
- ఎదిగిన చెట్టుకు రోజుకు 200–250 లీటర్ల నీరు అవసరం. వరి పండించడానికి ఎకరాకు 80 లక్షల లీటర్ల నీరు అవసరం. ఆయిల్ పామ్ తోటకు ఎకరాకు ఏడాదికి 50 లక్షల లీటర్ల నీరు సరిపోతుంది.
- సేంద్రియ ఎరువులు వేస్తే పంట అధిక దిగుబడి వస్తుంది.
- నేలను బట్టి ఎకరాకు 10–20 టన్నుల గెలల దిగుబడి వస్తుంది. టన్ను గెలకు మార్కెట్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.20 వేలకుపైగా ఉంది. ఎకరాకు సాగు ఖర్చు రూ.30 వేలు అవుతుంది. కనీసం 10 టన్నుల దిగుబడి వచ్చినా రూ.2 లక్షల ఆదాయం వస్తుంది. ఖర్చులు పోగా రూ.1.70 లక్షల ఆదాయం ఖాయం. నాల్గో సంవత్సరం నుంచి 25–30 సంవత్సరాల వరకు పంట దిగుబడి వస్తుంది. జూన్ నుంచి ఫిబ్రవరి వరకు దిగుబడి వస్తుంది. నూనె దిగుబడి 17–22 శాతం వస్తుంది.

ప్రభుత్వ సబ్సిడీ..

- ప్రభుత్వం ఆయిల్ పామ్ మొక్కలకు 90 శాతం సబ్సిడీ ఇస్తుంది. ఎరువుల కోసం ఏడాదికి హెక్టారుకు రూ.20 వేల చొప్పున నాలుగు సంవత్సరాలు చెల్లిస్తుంది. పంట కోత, గెలల రవాణాకు ఉద్యాన శాఖ నుంచి సబ్సిడీ అందిస్తుంది.



ఆయిల్ పామ్ గెలలతో చెట్టు

- ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా పంట నష్టం ఉండదు. కోతులు, ఇతర పక్షులు, జంతువుల బెడద ఉండదు. అవి పంట దారిదాపుల్లోకి రావు. పర్యావరణానికి హితంగా ఉండి సకాలంలో వర్షాలు కురవడానికి దోహదపడతాయి.

అంతా కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే..

- కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ యాక్టు ద్వారా గుర్తించిన ప్రాంతాల్లోనే పంట సాగుచేయాలి. తెలంగాణ రాష్ట్రంలో 2.30 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగవుతోంది. ప్రభుత్వం ద్వారా లైసెన్స్ పొందిన ఫ్యాక్టరీ వారు ఉద్యాన శాఖ సహకారంతో పంటను కొనుగోలు చేస్తారు. మండలానికి ఒక పికప్ పాయింట్ ఏర్పాటు చేసి ఫ్యాక్టరీలకు తరలిస్తారు. రైతులు పండించిన పూర్తి పంటను సంబంధిత ఫ్యాక్టరీ కచ్చితంగా కొనుగోలు చేస్తుంది. తిరస్కరించడానికి వీలులేదు. పంట కొనుగోలు ధరను రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఉద్యాన శాఖ కమిటీ నిర్ణయిస్తుంది. ప్రతి మూడు నెలలకోసారి ధరను నిర్ణయిస్తారు..
- ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పకుండా నేరుగా రైతుల ఖాతాల్లోనే గెలల డబ్బులు జమచేస్తారు.

వైభవంగా మారెమ్మ తల్లి పండుగ



తలపై బోనంతో ఆలయానికి వస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, తదితరులు

రాయపర్తి : మండలంలోని మైలారంలో మారెమ్మ తల్లి పండుగను గ్రామస్తులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తలపై బోనంతో ఆలయానికి వచ్చి తల్లికి మొక్కులు చెల్లించారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి మొక్కులు చెల్లించేందుకు బోనాలతో వస్తుండగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గీయుల నడుమ తోపులాట చోటుచేసుకుని ఒకరిద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఎస్సై శ్రవణ్‌కుమార్, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

సమ్మక్క రాకతో పులకరించిన భక్తజనం

- అడుగడుగునా నీరాజనం

నల్లబెల్లి : తల్లుల రాకతో నల్లబెల్లి, మద్దిమేడారం జాతర భక్తులు పులకరించారు. శివసత్తుల పూనకాలు, భక్తుల కేరింతల నడుమ కొండాయిల్‌పల్లి ఏనె, జెండగట్టు నుంచి గురువారం సమ్మక్కను తీసుకురావడం ఉద్విగ్నభరితంగా సాగింది. భక్తుల రక్షణ వలయంలో సమ్మక్కను పూజారులు గురువారం సాయంత్రం గద్దెకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. శివసత్తుల పూనకాలు.. ఎదుర్కోళ్ల మొక్కులు కోలాహలం.. వరాలు పట్టడం అలరించాయి. కొండాయిల్‌పల్లి ఏనె, కొండాపూర్ శివారులోని జెండగట్టు అటవీ ప్రాంతం నుంచి ఆలయ ప్రధాన పూజారి ప్రవీణ్, దురిశెట్టి నాగరాజుతోపాటు ఇతర పూజారులు మూడు గంటల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండాయిల్‌పల్లి ఏనే, జెండాగట్టుకు మేకను వేర్వేరుగా బలి ఇచ్చి కుంకుమ భరణి, లంకబియ్యం పెట్టి తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ భరిణె రూపంలో ఉన్న



సమ్మక్కను తీసుకొస్తున్న పూజారి ప్రవీణ్

సమ్మక్కను చేతపట్టుకొని సమ్మక్క ప్రధాన పూజారులు ప్రవీణ్, నాగరాజు సమ్మక్క తల్లులను కాలినడకన శివసత్తుల చిందులు, భక్తుల కేరింతలు, డోలు వాయిద్యాలతో బయలుదేరారు. తర్వాత ఆయా దేవాలయాల్లో పగిడిద్దరాజు ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేసి సమ్మక్కను సాయంత్రం గద్దెపైకి చేర్చారు. సమ్మక్క–సారలమ్మ గద్దెలకు చేరడంతో భక్తులు దర్శించుకుని పరవశించారు. ఎత్తు బంగారం, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

హమాలీల కూలి పెంపునకు ఒప్పందం



మాట్లాడుతున్న నరేందర్, మాధవశంకర్

నర్సంపేట : హమాలీల కూలి పెంపునకు ఒప్పందం కుదిరింది. గతేడాది డిసెంబర్ 21తో గతంలో యజమానులతో చేసుకున్న హమాలీల కూలి రేట్ల ఒప్పందం ముగిసిన క్రమంలో కూలి పెంపు కోసం అఖిలపక్ష కార్మిక సంఘాలు నోటీస్ అందజేయగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు గంధం నరేందర్, ప్రధాన కార్యదర్శి శింగిరికొండ మాధవశంకర్ ఆధ్వర్యంలో గురువారం చర్చలు జరిపారు. గతంలో ఉన్న రేట్లపై 12 శాతం పెంచేలా ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నరేందర్, మాధవశంకర్ మాట్లాడారు. కూలి రేట్ల పెంపు ఒప్పందం వచ్చే ఏడాది డిసెంబర్ 31 వరకు వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘాల నాయకులు మోడెం మల్లేషం, కొల్లూరి లక్ష్మీనారాయణ, గుంపెల్లి మునీశ్వర్, చింతం యాకన్న, బొల్లి శ్రీనివాస్, సిరిపెల్లి పోషాలు, గాదం రవి, గడ్డం శ్రీనివాస్, బాస రాజేందర్, మంద మల్లయ్య, గొర్రె ప్రశాంత్, రవి, జనార్దన్, సదయ్య, రాజు, శ్రీనివాస్, దేవన్న, లచ్చిబాబు, రవికుమార్, ఈర్ల రాజు, ఐలయ్య, చంద్రమౌళి, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



దుగ్గొండి : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తించి ఎస్సైగా ఉద్యోగోన్నతి పొంది బదిలీ అయిన అనిశెట్టి విజయ్‌కుమార్ ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు , సిబ్బంది గురువారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. ఏఎస్సైగా విజయ్‌కుమార్ సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని ఉద్యోగోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీసీలు రాకేశ్, శేఖర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులో భద్రతను పటిష్టం చేయండి

- ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలోని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు (టీజీవీబీ) శాఖలో భద్రతను పటిష్టం చేయాలని సిబ్బందికి ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన బ్యాంకును గురువారం సందర్శించి భద్రత ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. లాకర్లు, సీసీ కెమెరాలు, ఇతరత్రా ప్రదేశాలను సందర్శించారు. అనంతరం ఆయన సిబ్బందికి సూచనలు చేశారు. బ్యాంకులో కిటికీలు పటిష్టంగా లేవన్నారు. సరిచేయాలని చెప్పారు. మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. బ్యాంకుల్లో దొంగతనాలు జరుగుతున్న క్రమంలో అప్రమత్తత కీలకమని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

వైద్యశిబిరం



దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 81 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఆరుగురికి వ్యాధి నిర్ధారణ కోసం రక్త, మూత్ర పరీక్షలు చేశారు. అనంతరం వైద్యాధికారి భరత్ మాట్లాడారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత శుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రెహ్మాన్, ఏఎన్ఎం కోమల, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగంపై నిర్లక్ష్యం

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గణేశ్

నర్సంపేట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పైస గణేశ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంఘం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడారు. విద్యారంగాన్ని కార్పొరేట్, ప్రైవేట్ శక్తులకు ధారాదత్తం చేసేలా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలిపారు. కొఠారీ కమిషన్ సిఫార్సు మేరకు 10 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.1,28,650 కోట్లు కేటాయించిందని చెప్పారు. పాఠశాల విద్యకు రూ.78 వేల 572 కోట్లు మాత్రమే ఇవ్వడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశాలు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అన్నపురెడ్డి సాయి, జయందర్, అఖిల్, జీవన్, రమేశ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతిలో బోధించాలి



పర్వతగిరి : విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో బోధించాలని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం పాక రమేశ్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పర్వతగిరి, సంగెం మండలాల తెలుగు భాషోపాధ్యాయుల నాల్గో కాంప్లెక్స్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పాక రమేష్‌బాబు మాట్లాడారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో బోధించే విధానాన్ని వివరించారు. విద్యార్థులు పాఠాలను ఆసక్తిగా విని సులభంగా అర్థం చేసుకోవడానికి వీలవుతుందని చెప్పారు. ఉపాధ్యాయులందరూ ఈ తరహా బోధనను అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు భాస్కర్, రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం



నర్సంపేట రూరల్ : మాట్లాడుతున్న ఎంఈఓ

నర్సంపేట రూరల్ : సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని నర్సంపేట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఆంగ్ల భాషా దినోత్సవాలు నిర్వహించారు. నర్సంపేట, మాధన్నపేటల్లోని జెడ్పీ సెకండరీ స్కూళ్లలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, ఉపన్యాసం, చిత్రలేఖనం, తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ కొర్ర సారయ్య హాజరై ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. ఆంగ్ల భాషా ప్రాముఖ్యతను వివరించారు. ఆంగ్లాన్ని ప్రపంచ భాషగా అభివర్ణించారు. విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మాధన్నపేట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఆలూరి రామచంద్రు, బాయ్స్ స్కూల్ ఉపాధ్యాయుడు ఉమామహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



నెక్కొండ : నివాళులర్పిస్తున్న ఎంఈఓ, టీచర్లు

నెక్కొండ : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో సరోజినీ నాయుడు చిత్రపటానికి ఎంఈఓ రత్నమాల, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడారు. ఆంగ్ల భాష వ్యాప్తికి సరోజినీ నాయుడు చేసిన కృషిని వివరించారు. విద్యార్థులకు ఆంగ్లంలో వ్యాసరచన, వక్తత్వం, ఆంగ్ల పద్యాలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం అనుముల శ్రీదేవి, ఆంగ్ల ఉపాధ్యాయులు వంగర లక్ష్మణ్, బూర వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో ఎంఈఓ, హెచ్ఎం, ఉపాధ్యాయులు

నెక్కొండ : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై చక్కటి వేషధారణలో తరగతులకు హాజరై బోధించారు. హెడ్‌మాస్టర్‌గా అబ్దుల్ రెహ్మాన్, ఎంఈఓగా నగేశ్, పీఈటీగా అర్జున్, మరి కొందరు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రత్నమాల మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి ఎదగాలని సూచించారు. నెక్కొండకు చెందిన రిటైర్డ్ విద్యుత్ శాఖ ఏడీ చల్లా రఘోత్తంరెడ్డి స్కూల్ విద్యార్థులకు షూ బహూకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ జాన్‌నాయక్, ఉపాధ్యాయులు భిక్షపతి, భారతి, మాలతి, కుమార్‌రెడ్డి, భద్రు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

‘గురిజాలలో కలపొద్దు’

చెన్నారావుపేట : మండలంలోని పాత మగ్దుంపురం గ్రామాన్ని గురిజాల ఎంపీటీసీలో కలపొద్దని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పరికి మధూకర్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం నర్సంపేట ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చంద్రకళకు గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం మధూకర్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగుతల నరేశ్, జన్ను రమేశ్, గడ్డమీది బాలకృష్ణ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో నాయబ్ తహసీల్దార్

సంగెం : సైబర్ నేరగాళ్లు రోజుకో విధంగా అధికారులు, ప్రజలను బెదిరిస్తూ, మభ్యపెడుతూ డబ్బులు దోచుకుంటున్నారు. ఈనెల 10వ తేదీన సంగెంలో పని చేస్తున్న పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) రమేశ్‌కుమార్ ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం బాధితుడి వద్ద డబ్బులు డిమాండ్ చేసి రూ. 10 వేలు తీసుకుంటుండగా ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని ఆసరా చేసుకున్న సైబర్ నేరగాళ్లు బుధవారం మండలంలోని ఓ మీసేవా నిర్వాహకుడికి ఫోన్ చేసి మండలస్థాయి అధికారుల ఫోన్ నంబర్లు కావాలని అడిగారు. తర్వాత ఎంపీడీఓ రవీందర్‌కు ఫోన్ చేసి తాను ఏసీబీ డీఎస్పీని మాట్లాడుతున్నానని, మీరు అవినీతికి పాల్పడుతున్నట్లు సమాచారం ఉందని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీనికి తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని సమాధానం ఇవ్వడంతో ఎంపీఓకు కాన్ఫరెన్స్ కలపాలని డిమాండ్ చేయగా ఆయన ఎంపీఓ కొమురయ్యకు కలిపాడు. ఎంపీడీఓను కట్ కావాలని చెప్పడంతో అతడు కట్ అయ్యాడు. ఎంపీఓను అవినీతికి పాల్పడుతున్నావని రూ. 2 లక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో అరెస్ట్ చేస్తామని బెదిరించడంతో తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. దీంతో నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు కాన్ఫరెన్స్ కలపాలని ఆదేశించడంతో కలిపాడు. అతడు ఫోన్ ఎత్తగానే సైబర్ నేరగాడు కాన్ఫరెన్స్ కట్‌చేసి నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫోన్ చేసి ఏసీబీ డీఎస్పీనని డబ్బులు ఇవ్వకపోతే ఇక్కడే సమీపంలో ఉన్నామని అరెస్ట్ చేస్తామని హెచ్చరించాడు. దీంతో భయాందోళనకు గురైన నాయబ్ తహసీల్దార్ ఇటీవల వచ్చిన జీతం తాలుకు డబ్బులను సైబర్ నేరస్తుడు చెప్పిన 9663755640 నంబర్‌కు రూ. 80వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. అనంతరం తాను మోసం పోయినట్లు గ్రహించి 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైం పోలీసులు వెంటనే అప్రమత్తమై నంబర్‌ను ట్రేస్ చేయగా సంబంధిత అకౌంట్‌లో కేవలం రూ 7,468 మాత్రమే ఉండగా సీజ్ చేశారు. కాగా, ఈ విషయమై ఎస్సై నరేశ్ మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు వివిధ హోదాల్లోని అధికారుల పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడితే అధికారులు గాని, ప్రజలు గాని భయాందోళనకు గురికావొద్దని సూచించారు. ఎవరికీ అనవసరంగా డబ్బులు ఇవ్వొద్దన్నారు. తమకు వచ్చిన ఫోన్‌కాల్ గురించి 1930కు గాని పోలీస్‌స్టేషన్‌లో గాని ఫిర్యాదు చేయాలని తెలిపారు.

బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఎన్నిక

వర్ధన్నపేట : బీఆర్ఎస్ పట్టణ కమిటీని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోధుమల మధుసూదన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తోటకూరి శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా అజీమ్, ఉపాధ్యక్షులుగా మహేశ్, రామన్న, నర్సయ్య, కార్యదర్శులుగా సతీశ్, వీరేందర్, సంయుక్త కార్యదర్శిగా సుధాకర్, ప్రచార కార్యదర్శిగా శ్రీధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ముత్యాలు, కోశాధికారిగా సోహేల్, కార్యవర్గ సభ్యులుగా దుబాసి కొమురయ్య, మర్రిపుడగల ప్రసాద్, మహబూబ్ అలీ, వాంకుడోతు వెంకన్న, సపావత్ వీరన్న, శివరాత్రి తిరుపతి, గుండె రాంశేషయ్య ఎన్నికయ్యారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయపర్తి : మండలంలోని బాల్‌నాయక్‌తండాలో రూ.48,000 విలువ చేసే 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు. బాల్‌నాయక్‌తండా పరిధిలోని రాజ్‌నాయక్‌తండాకు చెందిన బానోత్ సూర్యం తన ఇంటి సమీపంలో పీడీఎస్ బియ్యం నిల్వ చేయగా హెడ్‌కానిస్టేబుళ్లు ఎల్లయ్య, జె.మధుసూదన్, ఎల్.నరేశ్ గుర్తించి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మాజీ ఎంపీటీసీ మృతి

గీసుకొండ : మండలంలోని మరియాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అల్లం శౌరెడ్డి (80) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా గురువారం ఆయన మృతదేహానికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.